క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన తాడేపల్లిగూడెం ఆర్డీఓ


కలెక్టర్ నాగరాణితో తాడేపల్లిగూడెం ఆర్డీఓ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో మంగళవారం కలెక్టర్ చదలవాడ నాగరాణిని తాడేపల్లిగూడెం ఆర్డీఓ యమ్మనూరి భవాని శంకరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వీరికి అభినందనలు తెలిపారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ భవాని శంకరిని డివిజన్ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

డ్వాక్రా ఏపీఎంగా కె.జ్యోతి రాణి


జ్యోతిరాణి

వీరవాసరం: మండలం డ్వాక్రా ఏపీఎంగా కె.జ్యోతిరాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానని చెప్పారు. జ్యోతిరాణి పాలకొల్లు నుంచి బదిలీపై వీరవాసరం ఏపీఎంగా వచ్చారు. ఇక్కడ పని చేసిన హసీనా బేగం గణపవరం బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఏపీఎం జ్యోతిరాణిని వీఓఏలు, సీసీలు, డ్వాక్రా సిబ్బంది అభినందించారు.

ఉండి ఈఓపీఆర్డీ బదిలీ


ఈఓపీఆర్డీ రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉండి: ఉండి మండల పరిషత్ ఈవోపీఆర్డీ రామకృష్ణారెడ్డి కోనసీమజిల్లా కపిలేశ్వరపురం మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీకి వీడ్కోలు సభను నిర్వహించిన అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఉండి ఈఓపీఆర్డీగా బదిలీపై వచ్చిన ఆయన ఎన్నికల విధుల్లో ఎంతో చాకచక్యంగా నిర్వర్తించి మంచిపేరు తెచ్చుకున్నారని ఎంపీడీఓ ఎస్.రవీంద్ర అన్నారు. ప్రస్తుతం ఉండి మండల ఈఓపీఆర్డీగా పెనుమంత్ర మండలం ఈవోపీఆర్డీ రెడ్డి బదిలీపై వస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

వైభవంగా మహాలక్ష్మీ హోమం


మహాలక్ష్మీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటే వారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గా శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా సాంప్రదాయబద్ధంగా మధు పుష్పాలతో మహాలక్ష్మీ హోమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను, చండి పారాయణం, శ్రీసూక్త పారాయణం, 70 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు, గాయత్రి హోమం, మధు పుష్పాలతో మహాలక్ష్మి హోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించారు.

వైభవంగా సామూహిక కుంకుమ పూజలు


సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఓవర్ బ్రిడ్జి రోడ్డులోని శ్రీకామాక్షి అమ్మవారి 42వ వార్షిక దేవి శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా 108 మంది స్త్రీలతో సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. పత్సమట్ల శ్రీనివాసరాజు, స్వప్న దంపతులు, రాయి చంద్రరావు, సత్యవతి దంపతులు, గాదిరాజు దుర్గరాజు, జ్యోతి దంపతులు, మాదేటి సుధీర్, సంకీర్తన దంపతులు, ముక్కామల జగన్నాథరావు, లక్ష్మి దంపతులతోపాటు 108 మంది స్త్రీలతో సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు.

రహదారుణం


మహదేవపట్నం నుంచి ఉండి వైపుగా వచ్చే రహదారి దుస్థితి

ఉండి: నియోజకవర్గ కేంద్రం నుంచి ఓ మేజర్ గ్రామ పంచాయితీకి వెళ్లే రహదారి అంటే కనీసంలో కనీసం ఓ మోస్తరుగా అయినా ఉంటుందని అనుకుంటాం. నిత్యం వందలాది మంది ప్రయాణించే రోడ్డును ఒకసారి కాకపోతే ఒకసారి అయినా దానికి మరమ్మతుల చేయాల్సి ఉంటుంది. అయితే నియోజకవర్గకేంద్రం ఉండి నుంచి సరిగ్గా 3.5 కి.మీ. దూరంలో ఉన్న మేజర్ గ్రామ పంచాయితీ మహదేవపట్నానికి ఉండి నుంచి వెళ్లాలంటే నిత్యం నరకం చూస్తున్నామని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. దాదాపు 22 ఏళ్ల నుంచి నుంచి ఈ రోడ్డుపై తట్టెడు మట్టి వేయలేదంటే నమ్మలేం. కానీ అదే నిజం. ప్రసిద్ధ వీరపేరంటాలమ్మ అమ్మవారి ఆలయం ముఖ ద్వారం వద్ద నుంచి ప్రారంభమయ్యే ఈ రోడ్డు మొత్తం 3.5 కి.మీ. ముందుగా 0.5 కి.మీ వెలివర్రు గ్రామ పంచాయితీ పరిధిలోనూ, 2 కి.మీ మహదేవపట్నం పరిధిలోనూ, ఒక కి.మీ ఉండి గ్రామ పంచాయితీ పరిధిలో ఉండటంతో ఏ ఒక్కరూ ఈ రోడ్డు అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదు.

ఉండిలో అప్పుడప్పుడు రిపేర్లు

ఉండి గ్రామ పరిధిలోని కిలోమీటరు మేర అప్పుడప్పుడూ చిన్నచిన్న రిపేర్లు చేస్తుండగా మిగిలిన ప్రాంతంలో 22 ఏళ్ల నుంచి కనీసం అధికారులు కన్నెత్తి చూడలేదంటే అతిశయోక్తి కాదు. దీంతో రోడ్డు వెలివర్రు పుంత నుంచి మహదేవపట్నం ప్రధాన రహదారి వరకు పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తుంది. ఈ రోడ్డు పరిస్థితిపై ఇరుగ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా రోడ్డుకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఇటీవల మహదేవపట్నం గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటించి రోడ్డు పరిస్థితిపై అధికారులకు ఆదేశాలిచ్చినా కనీసం రోడ్డును పర్యవేక్షించేందుకు అధికారులు శ్రద్ధ చూపకపోవడం దారుణమంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ప్రమాదాలు

ఉండి నుంచి వెలివర్రు పేరంటాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులు భీమవరం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే అత్యంత అనుకూలమైన రోడ్డుగా మహదేవపట్నం రోడ్డు ఉంది. అయితే ఈ రోడ్డు గురించి సరిగ్గా తెలియని భక్తులు రోడ్డులో ప్రయాణించి ప్రమాదాలకు గురువుతున్నారు. అంతే కాకుండా మహదేవపట్నం గ్రామం మీదుగా చిలుకూరు, యండగండి, పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, బీవీరాజు కళాశాల, పాలకోడేరు, భీమవరం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చే ప్రయాణికులు రోడ్డును చూసి లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వంలో రోడ్లపై గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత ఎందుకు పట్టించుకోవడం లేదంటూ పలువురు వాహనదారులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులతో పాటు నాయకులు స్పందించి రోడ్డు పరిస్థితిని మెరుగుపర్చాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు

రోడ్డు నిర్మాణానికి కృషి

మహదేవపట్నం, ఉండి రహదారి నిర్మాణం కోసం ఇప్పటికే ఎమ్మెల్యే, కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. నిధులు మంజూరు కాగానే రోడ్డు నిర్మాణం వేగంగా చేపడతాం. ఈ రోడ్డు సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుంది.

– వనిమా వెంకట సుబ్బలక్ష్మీ శ్రీనివాస్, సర్పంచ్ మహదేవపట్నం

నేడు ఐటీఐ సర్టిఫికెట్ల అందజేత

ఉండి: ఉండి ఎన్నార్పీ అగ్రహారం(భీమవరం)లోని ప్రభుత్వ ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్, ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, ఐటీఐ ఐఎంసీ చైర్మన్ సామంతపూడి బాలకృష్ణంరాజు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

పాత నేరస్తుల అరెస్టు

పాలకోడేరు: వివిధ చోట్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను మంగళవారం చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు భీమవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. చాగల్లు గ్రామానికి చెందిన డొక్కా సాయి కిరణ్ (24) , ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామానికి చెందిన మండా రాజేష్ (25)లు ఇద్దరూ కూడా దొంగతనాలకు అలవాటు పడ్డారు. వివిధ చోట్ల చోరీలు చేస్తూ మార్చి నెలలో గొరగనమూడి గ్రామానికి చెందిన నీలి వెంకట నాగ సాయి కుమార్ ఇంట్లో కొన్ని బంగారు ఆభరణాలు, లాప్‌టాప్ దొంగిలించుకుపోయారు. ఫిర్యాదు అందుకున్న భీమవరం రూరల్ సీఐ పాలకోడేరు ఎస్సై ఎస్.హరిబాబు కేసును త్వరితగతిన విచారణ చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు కోర్టు 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

ఎంపీటీసీ సభ్యుడిపై ఫిర్యాదు

పాలకోడేరు: గరగపర్రు ఎంపీటీసీ షేక్ పాపా సాహెబ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు ఎస్సీ నేతలు భీమవరం సీఐకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇప్పటికే శ్మశానవాటిక భూమిని చాలావరకు ఆక్రమించుకున్న పాపా సాహెబ్ మరింత ఆక్రమణకు యత్నిస్తుండగా అడ్డుకున్నామని తమపై కక్ష గట్టి అల్లరి సృష్టించి కులమతాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సత్తోల జీవరత్నం, కోనాల ఎలీషా రావు, సత్యాల యేసు, డి.లాజరు, కె.రాజు, ఆర్.సత్యప్రసాద్ ఫిర్యాదు చేశారు.

వరద బాధితులకు విరాళం

భీమవరం: రాష్ట్రంలోని వరద బాధితులను ఆదుకునేందుకు సామాజిక బాధ్యతగా దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భీమవరం డీఎన్నార్ స్కూల్ విద్యార్థులు సేకరించిన రూ1.50 లక్షలు, కళాశాల యాజమాన్యం రూ. లక్ష సహాయాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యలమంచిలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు ఏఎస్సై దుర్గారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మట్టపర్రు గ్రామానికి చెందిన చెల్లుబోయిన చైతన్య బాబు (21) అతని స్నేహితుడు గెడ్డం సూర్యకిరణ్ ఈ నెల 6న కాళ్ల గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి బయలుదేరారు. చించినాడ వద్ద వశిష్ఠ గోదావరి నది వంతెన దిగుతుండగా ఎదురుగా వస్తున్న కారుని ఢీ కొట్టడంతో గాయపడ్డారు. సూర్యకిరణ్‌కు స్వల్ప గాయలవ్వగా, చైతన్య బాబు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చైతన్య బాబుని ఉన్నత వైద్యం నిమిత్తం విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మరణించాడు. ఈ మేరకు మృతుడి తండ్రి చెల్లుబోయిన వీరాంజనేయులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దుర్గారావు తెలిపారు.

మహాలక్ష్మీ నమోస్తుతే


భీమవరం (ప్రకాశం చౌక్): ధనలక్ష్మీదేవిగా గునుపూడి ఆదిలక్ష్మి అమ్మవారు


ఆకివీడు: మహాలక్ష్మీ దేవిగా ఆకివీడు పెద్దింటి అమ్మవారు.


ఉండి: శ్రీరామక్షేత్రంలో మహలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ


భీమవరం (ప్రకాశం చౌక్): లక్ష్మీదేవి అలంకరణలో మహిషాసురమర్దనీ అమ్మ వారు

భీమవరం (ప్రకాశం చౌక్): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా భీమవరం మావుళ్లమ్మ వారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ఆలయ ఈఓ బుద్దా మహాలక్ష్మీ నగేష్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. శ్రీరాంపురంలోని శ్రీజగన్మాత కనకదుర్గ అమ్మవారి 32వ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా పెయింటర్స్ అండ్ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాలక్ష్మీదేవిగా అలంకరించినట్లు పెయింటర్స్ అండ్ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని సత్యనారాయణ, కార్యదర్శి పోన్నా రంగారావు తెలిపారు. ఆలయ అర్చకులు బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం, ప్రసాద్ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. గునుపూడిలోని ఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి అమ్మవార్లను ధనలక్ష్మి దేవిగా అలంకరించారు. భీమవరం నాచువారి సెంటర్ లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ఒంటెద్దు బళ్ల సంఘం ఆధ్వర్యంలో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. భీమవరం మెంటే వారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గా శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న మహిషాసురమర్దని అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ తోట శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాళ్లలో..

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో మంగళవారం శ్రీలక్ష్మి శరన్నవరాత్ర మహోత్సవల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు. అమ్మవారికి ఉదయం శ్రీ చక్ర అభిషేకం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈఓ అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే దొడ్డనపూడి గ్రామంలోని రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో భక్తులకు మహాలక్ష్మీ అమ్మవారి అలంకరణలో దర్శనమిచ్చారు. రూ. 27 లక్షల రూపాయలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారి అలంకరణను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తుల హాజరయ్యారు.

ఉండిలో..


ఉండి: దసరా ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు కనకదుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉండి శ్రీరామక్షేత్రంలో అమ్మవారిని భక్తులు నగదుతో అలంకరించారు. మండల వ్యాప్తంగా 19 గ్రామాల్లోను వాడవాడలా మహాలక్ష్మీ అమ్మవారి అవతారంలో ఉన్న దుర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆకివీడులో..

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల పెద్ద ఎత్తున అమ్మవార్ల ఆలయాల్లో పూజలు చేశారు. స్థానిక గ్రామ దేవత పెద్దింటి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి, కుంకుమ పూజలు చేశారు. ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో ప్రత్యేక మండపంలో ఏర్పాటు చేసిన వాసవీ మాతను రూ. 40 లక్షల రపాయల నోట్లతో అలంకరించి, భక్తులు పూజలు చేశారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి ఆలయంలోనూ, వనువులమ్మవారిని,దానేశ్వరి, గంగానమ్మ, మారెమ్మ, దుంపగడప గేటు వద్ద కనకదుర్గమ్మను మహాలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు.


ఆకివీడు: రూ.40 లక్షలతో అలంకరించిన వాసవీమాత


కాళ్ల: దొడ్డనపూడిలో మహాలక్ష్మీ దేవికి పూజలు చేస్తున్న భక్తులు


భీమవరం (ప్రకాశం చౌక్): లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో మావుళ్లమ్మ

నిత్యావసరాల ధరలు తగ్గించాలని ధర్నా



భీమవరం వైఎస్సార్‌కాలనీలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ భీమవరం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్ కాలనీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకుడు ఎం వైకుంఠరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరలను అదుపు చేస్తామని చెప్పి ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలయ్యారని విమర్శించారు. టమాటా కిలో రూ. 100, ఉల్లిపాయలు రూ. 60, పామాయిల్ రూ.120 అమ్ముతుంటే సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఇసుక కొరతలో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతుంటే పెరుగుతున్న నిత్యావసర వస్తు ధరలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చినా నిత్యావసరాల ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని బీజేపీ మద్దతు ఇస్తున్న తెలుగుదేశం, జనసేనపార్టీలు కూడా ధరలు పెరుగుదలకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.త్రిమూర్తులు, ఎం.మంగ, కె.అరుణ, గాలి ప్రభావతి, నాగలక్ష్మి, రేణుక కామాక్షి, యర్రంశెట్టి నాగమణి, పట్నాల రేణుక తదితరులు పాల్గొన్నారు.

సప్తనిధి లిమిటెడ్ క్వాజీ బ్యాంకింగ్ వార్షికోత్సవం


సప్తనిధి లిమిటెడ్ క్వాజీ బ్యాంకింగ్ వార్షికోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): సప్తనిధి లిమిటెడ్ క్వాజీ బ్యాంకింగ్ వారి 5వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని భీమవరం శాఖలో ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రముఖులను, ఖాతాదారులను సంస్థ తరపున సన్మానించారు. సీఈఓ కొల్లి స్వామి నాయుడు మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా ఖాతాదారులు మాపై ఉంచుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వ్యాపార దృక్పథంతోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలను కూడా సంస్థ ద్వారా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో దాయన చంద్రాజీ, చెరుకువాడ రంగసాయి, కంచర్ల వెంకట రమణారావు (కొండ), ఎంవీ కృష్ణంరాజు, ఐవీ సురేష్, కొల్లి దుర్గా శివరాం, జనరల్ మేనేజర్ పీవీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మేన్ నిర్లక్ష్యంపై ఫిర్యాదు

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామంలో పని చేస్తున్న లైన్‌మేన్ నిర్లక్ష్యం వల్ల తన రొయ్యల చెరువు పాడైపోయిందని గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీపీ భర్త కఠారి కేశవరావు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మంగళవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలోని కొల్లేరు రోడ్డుకు ఆనుకుని ఉన్న రొయ్యల చెరువు లీజుకు చేస్తున్నట్లు సోమవారం సాయంత్రం విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, లైన్‌మేన్‌కు చెప్పగా, తమకు అనేక పనులుంటాయని, రేపు వచ్చి చేస్తానని చెప్పినట్లు కేశవరావు విలేకర్లకు తెలిపారు. జనరేటర్‌తో ఏరియేటర్లు తిప్పుతుండగా జనరేటర్ ఆగిపోయిందని చెరువులో రొయ్యలకు ఆక్సిజన్ అందక చనిపోయే పరిస్థితికి రావడంతో ఆందోళనకు గురై మంగళవారం పట్టుబడి పట్టానని చెప్పారు. 150 కౌంట్‌లో పట్టడం వల్ల తనకు లక్షలాది రూపాయలు నష్టం వచ్చిందని, కేవలం లైన్‌మేన్ నిర్లక్ష్యమేనని, అతనిపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై రూరల్ ఏఈ ప్రసాదరాజును వివరణ కోరగా జరిగిన సంఘటనను తెలుసుకుంటున్నట్లు చెప్పారు.

ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ


ఆకివీడు: మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీపీ కఠారి జయలక్ష్మి


ఉండి: ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆకివీడు: గ్రామ స్వరాజ్యం, గ్రామాభివృద్ధి స్థానిక ప్రజా ప్రతినిధుల చేతుల్లోనే ఉందని ఎంపీపీ కఠారి జయలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఉపసర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం మొదటి రోజు మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కనీస పరిపాలనలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఏపీ సీఆర్‌చట్టం 1994 ముఖ్య నిబంధనలను తెలుసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, మంచినీరు, వీధిలైట్లు వంటివాటిపై దృష్టి పెట్టాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జీ మాట్లాడుతూ పంచాయతీ ఆస్తుల పరిరక్షణ బాధ్యత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులదేనన్నారు. ఆర్థిక నిర్వహణ, కోర్టు కేసులకు సంబంధించి భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు గురించి తెలుసుకుని, ప్రజలకు అందే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు కొట్టు మాణిక్యాలరావు, నాగేశ్వరరావు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: పంచాయతీ పాలనపై ఉపసర్పంచ్,వార్డు సభ్యులకు అవగాహనపై ఉండి మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, ఈఓపీఆర్‌డీ రామకృష్ణారెడ్డి పంచాయతీరాజ్ చట్టాలు, పంచాయతీ పాలనపై అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో ఎన్నికైన వార్డు సభ్యులు ప్రతి ఒక్కరూ తమ విధులు, హక్కులు, పథకాలపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయితీలకు మంజూరయ్యే నిధులు, పథకాలపైనా అవగాహన ఉంటేనే పంచాయతీ పాలన బాగా జరుగుతుందన్నారు. వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌లకు పంచాయితీ చట్టాల ద్వారా లభించే హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని తెలిపారు.

అయోధ్య రామాలయ ఆర్కిటెక్ట్‌కు సత్కారం


రంగారావును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): అయోధ్య రామమందిర నిర్మాణానికి డిజైన్ ఇచ్చిన మండెల పాండు రంగారావును భీమవరంలో మంగళవారం సత్కరించారు. రంగారావు భీమవరం వాసి కావడం మనకు గర్వకారణమని వక్తలు తెలిపారు. తొలుత స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న రంగారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సత్కార సభలో ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు తదితరులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు ఎస్.రామారావు, చెరుకువాడ రంగసాయి, వి.శ్రీవెంకటేశ్వర్లు, కుక్కల బాల తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అజ్జాలమ్మ జాతర

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామ దేవత అజ్జాలమ్మ అమ్మవారి ఆలయ 20వ వార్షికోత్సవ జాతర గురువారం నుంచి ఈ నెల 12 వరకూ నిర్వహిస్తామని నిర్వాహకులు మంగళవారం విలేకరులకు తెలిపారు. గురువారం అమ్మవారికి పంచామృతాలతో, పూలతో అభిషేకాలు, సుగంధ పుష్పాలతో అలంకరిస్తారు. 11న సామూహిక అష్టోత్తర సహస్రనామ కుంకుమార్చన పూజలు, చలివిడి పానకం గ్రామస్తులు సమర్పిస్తారు. 12న అమ్మవారిని గ్రామంలో ఊరేగిస్తూ జాతర మహోత్సవం సంబరం నిర్వహిస్తారు. ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.